
బంజారాహిల్స్‌లోని ఇంట్లో పూజ చేస్తున్న కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కె.కేశవరావు, మేయర్ విజయలక్ష్మి


భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి కార్యాలయంలో పూజల అనంతరం పోస్టర్ ఆవిష్కరించిన ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి, సమితి ప్రతినిధులు కుమార్ చౌదరి యాదవ్, ఆలె భాస్కర్, శాంతి కుమార్ తదితరులు


వెంకటగిరిలో పూజలు నిర్వహించిన బీజేపీ నాయకులు పులిరాం, బరిగెల జ్ఞానేశ్వర్, బడుగు సతీష్ తదితరులు


భారీ గణపతి వద్ద పూజాధికాలు నిర్వహిస్తున్న మాజీ కార్పొరేటర్ బి.భారతీనాయక్, బాబానాయక్, రాములు చౌహాన్ తదితరులు

జయము లివ్వు బొజ్జ గణేశా

ఘనంగా వినాయక చవితి వేడుకలు


బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.12లో చావ సినిమా ప్రేరణలో శంభాజీ మహారాజ్ రూపంలో వినాయకుడిని ప్రతిష్ఠించిన యువకులు


మోడల్‌కాలనీలోని గణపతి మండపంలో ప్రథమ వందిత్ గణేశ్ ప్రవచనాలు చేస్తున్న డా. శిల్పా దీది

వినాయక చవితి వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి ఆలయాల్లో భక్తులు దైవదర్శనానికి పోటెత్తారు. విజయగణపతి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే దానం నాగేందర్ పూజాధికాలు చేశారు. బంజారాహిల్స్‌లో మేయర్ గద్వాల్ విజయ లక్ష్మి దంపతులు, మాజీ కార్పొరేటర్ బి.భారతీనాయక్ తదితరులు పూజాధి కాలు నిర్వహించారు. ఎల్లారెడ్డిగూడ గంగాధర భక్త సమాజ్‌లో జరిగిన పూజా కార్యక్రమంలో బస్తీ పెద్దలు శంకర్‌రావు, గొంటి శ్రీనివాస్‌యాదవ్, వనం శ్రీనివాస్‌యాదవ్, మల్లారెడ్డి, కుమార్‌చౌదరి యాదవ్, సంతోష్‌గౌడ్ పాల్గొన్నారు.

బంజారాహిల్స్/బోరబండ/ఎర్రగడ్డ/బేగంపేట/ఖైరతాబాద్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి)


ఖైరతాబాద్ గణపతి క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్, డీసీపీ శిల్పవల్లి తదితరులు


బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.14 వేంకటేశ్వర ఆలయం ప్రాంగణంలో ఆకట్టుకుంటున్న వినాయక మండపం సెట్


దేవరకొండ బస్తీలో అరుందతి వెల్ఫేర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడు


సీతారామ భక్త సమాజం ఆధ్వర్యంలో హెచ్.ఎఫ్.నగర్‌లో ఏర్పాటు చేసిన గణపతి మండపంలో పూజలు చేస్తున్న భక్తులు


బోరబండ రాజ్‌నగర్‌లో కింగ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి మండపంలో భక్తుల సందడి


రాజీవ్ నగర్ గణేశ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేశుడి వద్ద పూజలు చేస్తున్న కమిటీ అధ్యక్షుడు కిలారి మనోహర్, బాపయ్య చౌదరి, రజిని, కిరణ్, రాజు, మోహన్‌రావు, హేమచందు, రాఘవయ్య, నరసింహారావు

బీసీల యుద్ధభేరి మహాసభ పోస్టర్ ఆవిష్కరణ


బీసీల యుద్ధభేరి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రొ.కోదండరాం

బర్కత్‌పుర, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): బీసీలకు విద్యా, ఉద్యోగ, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ల సాధన కోసం ఈనెల 31న రవీంద్రభారతిలో నిర్వహించే బీసీల యుద్ధభేరి మహాసభ పోస్టర్‌ను టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్, ప్రొఫెసర్ కోదండరాం, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ గురువారం వేర్వేరుగా ఆవిష్కరించినట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ తెలిపారు. ఈ మేరకు వారిని మహాసభకు ఆహ్వానించినట్లు తెలిపారు.

అరెస్ట్ వారెంట్ పేరిట వృద్ధుడికి బెదిరింపు

- రూ.33.40 లక్షలు వసూలు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మీకు మానవ అక్రమరవాణా గ్యాంగ్‌తో సంబంధాలున్నాయని, అరెస్ట్ వారెంట్ వచ్చిందని ఓ వృద్ధుడిని భయపెట్టిన సైబర్ నేరగాళ్లు అతడి నుంచి రూ.33.40 లక్షలు వసూలు చేశారు. వివరాలిలా.. బోయినపల్లికి చెందిన వృద్ధుడి(73)కి జూలై 25న ఓ సైబర్ నేరగాడు ఫోన్ చేసి తనను తాను కర్నాటక క్రైం బ్రాంచ్ అధికారి గౌరవ్ సారథిగా పరిచయం చేసుకున్నాడు. మానవ అక్రమరవాణా కేసులో మీ ఆధార్ కార్డు ఆధారంగా బ్యాంక్ ఖాతాల వినియోగం జరిగిందని, మీపై అరెస్ట్ వారెంట్ జారీ అయిందని భయపెట్టాడు. అందుకు సంబంధించి నకిలీ పత్రాలు చూపి, విచారణ పూర్తయ్యే వరకు ఎవరితో మాట్లాడవద్దని ఆదేశించాడు. తర్వాత వీడియోకాల్‌లో మాట్లాడిన సైబర్ నేరగాడు దయానాయక్‌గా పరిచయం చేసుకుని ఫండ్ వెరిఫికేషన్ అంటూ రూ.15 లక్షలు ఆర్‌బీఐ ఖాతాలకు బదిలీ చేయాలని సూచించాడు. తర్వాత పలు కారణాలు చూపుతూ పలుమార్లు డబ్బు బదిలీ చేయించుకున్నాడు. వెరిఫికేషన్ పూర్తయిన తర్వాత డబ్బు మీ ఖాతాలో జమ చేస్తామని చెబుతూ ఆగస్టు 8 వరకు పలు దఫాలుగా రూ.33.40 లక్షలు వసూలు చేశాడు. డబ్బు ఎప్పుడు రీఫండ్ చేస్తారని ప్రశ్నించగా, అతడు స్పందించడం మానేశాడు. దాంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు సైబర్ క్రైం ఠాణాలో ఫిర్యాదు చేశాడు.

ఎస్‌సీఆర్‌లో మెడికల్ సర్టిఫికెట్ జారీ స్కాం

- సికింద్రాబాద్ డాక్టర్‌కు రూ.లక్ష లంచం ఎర
- ముగ్గురిపై సీబీఐ కేసు నమోదు

హైదరాబాద్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే(ఎస్‌సీఆర్) పరిధిలో మెడికల్ సర్టిఫికెట్ల స్కామ్ వెలుగు చూసింది. ఈ విషయమై ముగ్గురు వ్యక్తులపై కేంద్ర దర్యాప్తు సంస్థ(సీబీఐ) కేసు నమోదు చేసింది. విజయవాడ సీనియర్ ప్యాసింజర్ మేనేజర్ ఒంటిపూడి శివనాగప్రసాద్‌కు జారీ చేయాల్సిన మెడికల్ సర్టిఫికెట్‌ను సికింద్రాబాద్-లాలాగూడ సెంట్రల్ హాస్పిటల్‌లో పనిచేస్తున్న డివిజనల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాస సత్యనారాయణ పెండింగ్‌లో పెట్టారు. ఈ సంగతి తెలుసుకున్న విజయవాడ రైల్వే ఆస్పత్రి ఆఫీసు సూపరింటెండెంట్ హస్మత్ అలీ బావమరిది షేక్ రసూల్ రంగంలో దిగాడు. నాగప్రసాద్‌కు మెడికల్ సర్టిఫికెట్ క్లియర్ చేయిస్తే రూ.లక్ష వస్తాయని రసూల్ తన బావకు చెప్పడంతో, తాను డాక్టర్ శ్రీనివాస సత్యనారాయణతో మాట్లాడుతానని, ఆ డబ్బు తేవాలని సూచించాడు. దాంతో నాగప్రసాద్ నుంచి రసూల్ ఆ మొత్తాన్ని సేకరించాడు. ఈ విషయం తెలిసిన డాక్టర్ శ్రీనివాస సత్యనారాయణ సమాచారాన్ని సీబీఐకి చేరవేశాడు. ఈనెల 26న హస్మత్‌అలీ, రసూల్, నాగప్రసాద్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామని సీబీఐ అధికారులు తెలిపారు.

మోడల్ కాలనీలో వన మహోత్సవం

బేగంపేట, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): సనత్‌నగర్‌లోని మోడల్‌కాలనీలో సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జె.ఎస్.టి సాయి ఆధ్వర్యంలో గురువారం వన మహోత్సవం నిర్వహించారు. వారం రోజులుగా కాలనీలో మూడు వందలకు పైగా మొక్కలను నాటినట్లు ఆయన తెలిపారు.

భారత్‌కు బంగారు, కాంస్య పతకాలు



తనిష్క్ మురళీధర్

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): కజకిస్తాన్‌లోని షిమ్‌కెంట్‌లో జరుగుతున్న 6వ ఏషియన్ షూటింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో స్టాండర్డ్ పిస్టల్ జూనియర్ మెన్ విభాగంలో భారత్ బంగారు, కాంస్య పతకాలను దక్కించుకుంది. ఈనెల 30 వరకు జరిగే ఈ పోటీల్లో భారత్ తరఫున పాల్గొన్న హైదరాబాద్ వాసి కొడవలి తనిష్క్ మురళీధర్ నాయుడు 25 మీటర్ల రేంజ్‌లో బంగారు, కాంస్యం పతకాలు గెలుపొందాడు.

పోలీసుల ఓవరాక్షన్

- ఉత్సవ కమిటీ సభ్యులకు, స్థానికులకు తప్పని తిప్పలు

ఖైరతాబాద్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఇతర ప్రాంతాల నుంచి ఖైరతాబాద్ గణపతి వద్ద విధులు నిర్వహించేందుకు వచ్చిన పోలీసుల తీరుతో ఉత్సవాల నిర్వాహక ప్రతినిధులతో పాటు స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉత్సవాలకు ఆహ్వానించిన వీఐపీలతో పాటు ప్రముఖులను సైతం లోనికి అనుమతించకపోవడంతో నిర్వాహక సభ్యులు తలలు బాదుకుంటున్నారు. మరోవైపు ప్రసాదాలు తయారు చేసి భక్తులకు పంపిణీ చేసేందుకు వెళ్లే సభ్యులను అడ్డుకోవడంతో పోలీసులకు, శ్రీ గణేశ్ ఉత్సవ కమిటీ ప్రతినిధులకు వాదోపవాదాలు జరిగాయి. శాఖ గ్రౌండ్‌లో ఉదయం, మధ్యాహ్నం, రాత్రి అన్ని శాఖల సిబ్బందికి, వాలంటీర్లకు భోజనాలు ఏర్పాటు చేయగా అందులో సేవ చేసేందుకు వెళ్లే వారిని పోలీసులు అడ్డుకోవడంతో తీవ్ర నిరాశకు గురయ్యారు. ఉత్సవాల నిర్వాహకుడు, చైర్మన్ సింగరి రాజ్ కుమార్ పోలీసుల వద్దకు వెళ్లి ఉత్సవ కమిటీ పాసులు ఉన్న వారిని, వారితో వచ్చేవారిని అనుమతించాలని కోరాల్సి వచ్చింది. ఉత్సవాల నిర్వాహకులను, సభ్యులను పోలీసులు పట్టించుకోకుండా విధులు నిర్వహించడంపై రెండు కమిటీల ప్రతినిధులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఒక కమిటీ స్థానిక ఎం ఎల్‌ఏ దానం నాగేందర్‌తో డీసీపీకి చెప్పించుకోగా, మరో కమిటీ సభ్యులు ఉత్సవాల చైర్మన్‌ను పలు చెక్‌పోస్టుల వద్దకు తీసుకువచ్చి అక్కడ విధులు నిర్వహిస్తున్న అధికారులకు చెప్పించాల్సి వచ్చింది. దీంతో పాటు స్థానికులైన కొందరు తమ వారిని లోకల్ మార్గం గుండా తీసుకెళ్లే సమయంలో చాలామందిని పోలీసులు అడ్డుకుంటున్నారని ఆరోపిస్తున్నారు. రెండు కమిటీల ప్రతినిధులు తమ వారికి పాస్‌లు ఇచ్చుకొని చాలామందికి పాసులు ఇవ్వలేదని ఆరోపిస్తున్నారు.

ఖైరతాబాద్ గణపతికి భారీ జంజం కండువా

ఖైరతాబాద్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్ గణేశుడికి ఎప్పటి మాదిరిగానే పద్మశాలి సంఘం ప్రతినిధులు నూలు జంజం, చేనేత కండువా, గరికమాల, పట్టు వస్త్రాలను సమర్పించారు. చవితి రోజున లక్డీకాపూల్ రాజ్‌దూత్ హోటల్ చౌరస్తా నుంచి గుర్రపు బగ్గీపై బ్యాండ్ మేళాతో వీటిని తెచ్చారు. అతిథుల చేతుల మీదుగా 75 అడుగుల జంజం, అంతే పొడవున్న చేనేత కండువా, గరికమాలను గణపతికి సమర్పించగా, ఇతర దేవతామూర్తులకు పట్టు వస్త్రాలను సమర్పించారు. ఇందులో ఎమ్మెల్యే దానం నాగేందర్, ఖైరతాబాద్ పద్మశాలి సంఘం అధ్యక్షుడు కడారి శ్రీధర్, ప్రధాన కార్యదర్శి ఏలె స్వామి, గౌరవ అధ్యక్షుడు గుర్రం కొండయ్య పాల్గొన్నారు.


భారీ గణపతికి చేనేత కండువాను సమర్పిస్తున్న పద్మశాలి సంఘం ప్రతినిధులు

ఆర్యవైశ్య సంఘం లక్ష రుద్రాక్షమాల

ఖైరతాబాద్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గణపతికి కాశీ నుంచి ప్రత్యేకంగా తెచ్చిన లక్ష రుద్రాక్షలతో మాల చేయించి సమర్పించారు. పక్కనున్న వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారికి, గజ్జెలమ్మ తల్లి విగ్రహాలకు మరో 30 వేల రుద్రాక్షలతో మాలలు చేయించి సమర్పించారు. దీనితోపాటు గణపతి ముందు శుక్రవారం ఉదయం 102 హోమ గుండాలతో లక్ష్మీగణపతి హోమం జరుపుతుండగా సెప్టెంబర్ 1వ తేదీన 150 జంటలతో సిద్ధి బుద్ధి సమేత విఘ్నేశ్వరుడి కల్యాణం జరపనున్నట్లు సంఘం ప్రతినిధి ప్రవీణ్ తెలిపారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

- కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్

బేగంపేట, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే తన ధ్యేయమని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో అడ్మిషన్లు, ఫీజు బకాయిలు తదితర సమస్యలపై ఇటీవల దళిత విద్యార్థుల తల్లిదండ్రులు ఎమ్మెల్యేను కలిసి వివరించారు. స్పందించిన ఆయన డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క దృష్టికి సమస్యలను తీసుకెళ్లారు. ఫీజు బకాయిలు రూ.18 కోట్లు, స్టేషనరీ రూ.21 లక్షలు, ఉపకార వేతనాల బకాయిలు రూ.10 లక్షలు విడుదల చేయించాలని కోరారు. డిప్యూటీ సీఎం ఆదేశాల మేరకు అధికారులు బకాయిలను విడుదల చేశారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు గురువారం ఎమ్మెల్యేను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

సర్కిల్-19 ఏఎంఓహెచ్, యూసీడీ పీఓ బదిలీ

వెంగళరావునగర్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీ సర్కిల్-19 ఏఎంఓహెచ్, యూసీడీ పీఓ బదిలీ అయ్యారు. ఇప్పటి వరకు ఇక్కడ యూసీడీ పీఓగా బాధ్యతలు నిర్వర్తించిన వెంకటకిషన్‌రావు ఇస్నాపూర్ మున్సిపాలిటీ కమిషనర్‌గా వెళ్లారు. కూకట్‌పల్లి సర్కిల్‌లో పనిచేస్తున్న పి.రాజశేఖర్ పటేల్ సర్కిల్-19 యూసీడీ పీఓగా బదిలీపై వచ్చారు. ఏఎంఓహెచ్‌గా విధులు నిర్వహించిన శివప్రసాద్ కూకట్‌పల్లి సర్కిల్‌కు బదిలీ కాగా, అక్కడ పనిచేస్తున్న వి.శ్రీనివాస్‌రావు సర్కిల్-19కు వచ్చారు. బదిలీపై వచ్చిన వారు గురువారం యూసుఫ్‌గూడ సర్కిల్-19 కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ

బోరబండ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): బోరబండ బలహీనవర్గాల కాలనీలో హైదరాబాద్ యూత్ కరేజ్(హెచ్‌వైసీ) తరఫున పేదలకు నిత్యావసరాలను గురువారం పంపిణీ చేశారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలోని బస్తీల్లో పేదలకు బియ్యంతోపాటు 17 రకాల సరుకులను అందిస్తున్నట్లు ప్రతినిధులు తెలిపారు. 20వేల మందికి సరుకుల కిట్లు అందించాలన్న హెచ్‌వైసీ అధ్యక్షుడు సల్మాన్ ఖాన్ నిర్ణయం మేరకు పంపిణీ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు షేక్ ఆరీఫ్ హుస్సేన్, షాబాజ్ తెలిపారు. ఇప్పటి వరకు 5వేల మందికి నిత్యావసర సరుకులు పంపిణీ చేశామని తెలిపారు.

స్కూల్ బస్సును ఢీకొన్న జీపు

యూసుఫ్‌గూడ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): స్కూల్ బస్సును మహేంద్ర జీపు ఢీకొట్టింది. ఈ సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీ సాయిరాం పాఠశాల బస్సు(టిఎస్ 08యుఎన్ 4358) డ్రైవర్ నీరజ్ కుమార్ పాఠశాల నుంచి రహ్మత్ నగర్ వస్తున్నాడు. మహేంద్ర జీపు(టిజి 09డి 6343) వేగంగా వచ్చి స్కూల్ బస్సును ఢీకొట్టింది. స్కూల్ బస్సు పూర్తిగా ధ్వంసమైంది. జీపు డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ పోలీసులకు పాఠశాల నిర్వాహకులు గురువారం ఫిర్యాదు చేశారు.

విద్యార్థి అదృశ్యం

యూసుఫ్‌గూడ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): బీ ఫార్మసీ విద్యార్థి అదృశ్యమయ్యాడు. రహ్మత్ నగర్‌కు చెందిన యాకూబ్ పాషా పెద్ద కుమారుడు మహ్మద్ అఫ్రోజ్ బీ ఫార్మసీ చదువుతున్నాడు. ఈనెల 23న ఫోన్ ఇంట్లో పెట్టి కళాశాలకు వెళ్లాడు. రాత్రి వరకు ఇంటికి తిరిగి రాకపోవడంతో మధురానగర్ పోలీసులకు తండ్రి గురువారం ఫిర్యాదు చేశాడు.

ప్రభుత్వ పాఠశాలలకు టాయిలెట్ క్లీనింగ్ యంత్రాలు


డీఈఓ రోహిణితో కలిసి టాయిలెట్ క్లీనింగ్ యంత్రాన్ని అందజేస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

బోరబండ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు ఏటీవీ ఫౌండేషన్ తరఫున టాయిలెట్ క్లీనింగ్ యంత్రాలను పంపిణీ చేయనున్నట్లు కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. బోరబండ డివిజన్ బలహీనవర్గాల కాలనీలోని నాట్కో ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జ్యోతినగర్ ప్రభుత్వ ఉర్దూ మీడియం ఉన్నత పాఠశాల, స్వరాజ్ నగర్ ఉర్దూ మీడియం ఉన్నత పాఠశాలకు హైదరాబాద్ డీఈవో రోహిణితో కలిసి టాయిలెట్ క్లీనింగ్ యంత్రాలను గురువారం ఆయన అందజేశారు. నియోజకవర్గం పరిధిలోని 250 పాఠశాలల్లో ఇప్పటి వరకు 100 పాఠశాలలకు క్లీనింగ్ యంత్రాలు అందజేశామని చెప్పారు. కార్యక్రమంలో ఖైరతాబాద్ మండల ఉప విద్యాధికారి శామ్యూల్ రాజ్, హెచ్‌ఎంలు గీత కల్వారి, ప్రమీలరాణి, విజయలక్ష్మి, బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకాల దీప క్‌రెడ్డి, అట్లూరి రామకృష్ణ, కిలారి మనోహర్, జూటూరి కీర్తిరెడ్డి, కొత్త వెంకటేష్, కృష్ణమోహన్, షర్మిల జాదవ్, శ్రీనివాస్, శ్రీధర్‌రెడ్డి, విజయ్ పాల్గొన్నారు.

బాలాజీ నెయ్యి దుకాణంలో అగ్నిప్రమాదం


బాలాజీ నెయ్యి దుకాణంలో మంటలు

పంజాగుట్ట, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): అమీర్‌పేటలోని బాలాజీ నెయ్యి దుకాణంలో మంగళవారం రాత్రి అగ్నిప్రమాదం సంభవించింది. దీంతో దుకాణం పూర్తిగా కాలిపోయింది. పక్కనే ఉన్న మరో దుకాణానికి స్వల్పంగా మంటలు అంటుకున్నాయి. అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేశారు. పంజాగుట్ట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అమీర్‌పేటలోని పిల్లర్ నంబర్.1444 వద్ద బాలాజీ నెయ్యి దుకాణం ఉంది. గడిచిన 50 సంవత్సరాలుగా దుకాణం నిర్వాహకులు నెయ్యిని విక్రయిస్తున్నారు. రాత్రి పది గంటల ప్రాంతంలో దుకాణం నుంచి చిన్నగా పొగ రావడంతో స్థానికులు గమనించి పంజాగుట్ట పోలీసులకు సమాచారం ఇచ్చారు. వినాయక చవితి బందోబస్తులో ఉన్న పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక శకటం వచ్చి మంటలను ఆర్పివేశారు. దుకాణంలో నిల్వ ఉన్న నెయ్యితో పాటు దుకాణం కాలిపోయింది. మంటలు పక్కనే ఉన్న మరో దుకాణానికి కూడా అంటుకోగా ఆర్పివేశారు. దట్టమైన పొగలు కమ్ముకోవడంతో స్థానికులు భయాందోళనకు లోనయ్యారు. నిర్వాహకుల ఫిర్యాదు మేరకు పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం సంభవించి ఉండవచ్చునని పోలీసులు అనుమానిస్తున్నారు.

కాంగ్రెస్ ఎస్సీ సెల్ చైర్మన్ నియామకం

వెంగళరావునగర్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఎస్సీ సెల్ విభాగం చైర్మన్‌గా రహ్మత్ నగర్‌కు చెందిన బోడ రాంచందర్ నియమితులయ్యారు. బుధవారం సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం చైర్మన్ సాయి మధుకర్ నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాంచందర్ మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేస్తానన్నారు. కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఎం.అరవింద్ కుమార్ యాదవ్, కిరణ్, ఖాసీం, మనోజ్ యాదవ్ పాల్గొన్నారు.

హియరింగ్ మొబైల్ క్లినిక్ ప్రారంభం

బంజారాహిల్స్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): శ్రీనగర్‌కాలనీకి చెందిన అక్షయ్ ఆకృతి స్వచ్ఛంద సంస్థ, ఆప్టమ్ సంస్థ అత్యాధునిక వసతులతో కూడిన మొబైల్ హియరింగ్ క్లినిక్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. దీనిని అక్షయ్ ఆకృతి వ్యవస్థాపకుడు డీపీకే బాబు, ఆప్టమ్ ఎండీ ఉమారత్నం గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డీపీకే బాబు మాట్లాడుతూ చిన్నారి వినికిడి పొందినప్పుడు వారి లోకమే మారిపోతుందని, విద్య, స్నేహాలు, భవిష్యత్తు అవకాశాల కోసం కొత్త తలుపులు తెరుచుకుంటాయని పేర్కొన్నారు. ఉమారత్నం కృష్ణన్ మాట్లాడుతూ ఇన్ ఇండియా ఫర్ ఇండియా కార్యక్రమాల ద్వారా 4 లక్షల మందికి పైగా ప్రత్యక్షంగానూ, దాదాపు 10 లక్షల మందికి పరోక్షంగానూ సహకారం అందించినట్లు చెప్పారు.

బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులుగా వెంకటస్వామి, ప్రేమ్‌కుమార్

బంజారాహిల్స్/యూసుఫ్‌గూడ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): బీజేపీ సెంట్రల్ జిల్లా ప్రధాన కార్యదర్శులుగా ఖైరతాబాద్ నియోజకవర్గం ఫిలింనగర్‌కు చెందిన గడ్డం వెంకటస్వామి, యూసుఫ్‌గూడ డివిజన్‌కు చెందిన డి.ప్రేమ్‌కుమార్ నియమితులయ్యారు. గౌతంనగర్ చౌరస్తాలో బీజేపీ కార్యకర్తలు వెంకటస్వామికి గురువారం సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ డివిజన్ అధ్యక్షుడు ముద్దంగుల శ్రీనివాస్ మాట్లాడుతూ నిబద్ధతతో పార్టీని బలోపేతం చేసేవారికి తగిన గుర్తింపు ఉంటుందనడానికి వెంకటస్వామికి లభించిన పదవే తార్కాణం అన్నారు. కార్యక్రమంలో సెంట్రల్ జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి కొత్త నీరజ, ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు వల్లెపు శంకర్, కార్యవర్గ సభ్యుడు దండగుల శ్రీనివాస్, గణేశ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. కాగా, ప్రేమ్‌కుమార్‌కు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు, జిల్లా అధ్యక్షుడు లంకాల దీపక్‌రెడ్డి నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతీ లబ్ధిదారుడికి అందేలా తన వంతు కృషి చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

● డీసీపీ రశ్మీ పెరుమాళ్



బోయినపల్లి రాణా ప్రతాప్ యువసేన గణపతి మండపాన్ని పరిశీలిస్తున్న డీసీపీ రశ్మీ పెరుమాళ్, తిరుపతి రాజు

బోయినపల్లి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : గణపతి మండపాల వద్ద నిర్వాహకులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని,అగ్ని ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. గురువారం నార్త్‌జోన్ డీసీపీ రశ్మీ పెరుమాళ్ బోయినపల్లిలోని వివిధ గణపతి మండపాలతో పాటు, బోయినపల్లి పోలీస్ స్టేషన్ ప్రక్కన ఉన్న రాణా ప్రతాప్ యువసేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి మండపా న్ని పరిశీలించారు. డీజేలకు అనుమతులు లేవని, ప్రతి ఒక్కరు నిబంధనలకు లోబడి వేడుకలు జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ తిరుపతి రాజు, ఎస్ఐ శివశంకర్, టింకు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



కృత్రిమ కొలనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సునీత

నిమజ్జనానికి కొలనులు : కార్పొరేటర్

చిలకలగూడ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): చిలకలగూడ మున్సిపల్ మైదానంలో వినాయకుల నిమజ్జనానికి జీహెచ్ఎంసీ సహకారంతో కృత్రిమ కొలనులు ఏర్పాటు చేసినట్లు సద్వినియోగం చేసుకోవాలని మెట్టుగూడ కార్పొరేటర్ రాసూరి సునీత తెలిపారు. గురువారం మున్సిపల్ సిబ్బందితో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. నాలుగు, ఏడు అడుగుల ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ వినాయకులు నిమజ్జనం చేయటానికి అనుకూలంగా ఏర్పాట్లు గావించినట్లు, అలాగే ఇళ్లల్లో, మండపాల్లో పూజించిన వినాయకులు, పత్రి వంటివి అప్పగిస్తే ఎప్పటికప్పుడు చెత్త వంటివి తొలగిస్తారని పేర్కొన్నారు.

ఎల్ఓసీ అందజేత



బోయినపల్లి బాపూజీనగర్‌కు చెందిన చునియాన కిరణ్ వైద్య సహాయం కోసం నిమ్స్ ఆస్పత్రికి ప్రభుత్వం నుంచి మంజూరైన ఎల్ఓసీని ఆయన కుటుంబ సభ్యులకు గురువారం పికెట్ కార్యాలయంలో అందచేసిన కంటోన్మెంట్ శాసనసభ్యుడు ఎస్.శ్రీగణేష్.

- సికింద్రాబాద్, ఆంధ్రజ్యోతి

ప్రజలు ప్రశాంతంగా జీవించాలి

రెజిమెంటల్‌బజార్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): దేశ ప్రజలు ప్రశాంత జీవనం సాగించేలా చూడాలని అభిషేక ఆరాధన నిర్వహించినట్లు బిషప్ డాక్టర్ థామస్ అన్నారు. సికింద్రాబాద్ వైఎంసీఏలో దహించు అగ్ని మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 9 నుంచి రాత్రి 9 వరకు నిరవధిక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో జరుగుతున్న ఉగ్రవాద కార్యకలాపాలు దూరం చేసి ప్రజలు ప్రశాంతంగా జీవనం సాగించేలా చూడాలని ఏసు క్రీస్తును ప్రార్థించినట్లు తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో 18 వందల చర్చిల ద్వారా క్రీస్తు పరిచర్యతో పాటు సంక్షేమ కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లో ప్రతిరోజు 400 మంది పేదలకు భోజనం పంపిణీ కార్యక్రమాన్ని అందుబాటులోకి తెస్తామని తెలిపారు. వితంతువులకు మూడు నెలల పాటు కుట్టు శిక్షణ ఇచ్చి, ఉచితంగా కుట్టు మిషన్‌లు పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రావులపాటి మోజస్, డాక్టర్ జయశీలన్, థామస్ షీబా, కృపా జయశీలన్, కన్వీనర్లు విజయ్, సిద్దార్థ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మహాగణపతి హోమం

చిలకలగూడ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మెట్టుగూడ అయ్యప్పస్వామి ఆలయంలో వినాయక చవితి పురస్కరించుకుని అష్టద్రవ్య మహాగణపతి హోమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మూడు వందలమంది మలయాళీయులు విశేష హోమంలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కె.పి.రవీంద్రన్, ప్రధాన కార్యదర్శి కె.పి.సి. నాయర్, కోశాధికారి గంగాధరన్, కార్యవర్గ సభ్యులు సునీల్‌కుమార్, సదాశివన్ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చర్యలు చేపట్టారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



మృతదేహం

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : రైలు పట్టాల పక్కన నడుచుకుంటూ వెళుతున్న గుర్తుతెలియని వ్యక్తిని రైలు ఢీకొనగా, అతడు అక్కడికక్కడే మరణించిన ఘటన మల్కాజ్‌గిరి రైల్వేస్టేషన్ సమీపంలో జరిగింది. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ పండరి తెలిపిన వివరాల ప్రకారం మల్కాజిగిరి-దయానంద్‌నగర్ రైల్వేస్టేషన్ల పరిధిలో గురువారం గుర్తుతెలియని ఓ 45 ఏళ్ల వ్యక్తి రైలు పట్టాల పక్కన కంకరాళ్లపై నడుచుకుంటూ వెళుతుండగా రైలు ఢీకొని బలమైన గాయాలతో అక్కడికక్కడే మరణించాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఉదయం ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. వ్యక్తి ఆచూకీ తెలిస్తే సికింద్రాబాద్ రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, లేదా 8712658581 నంబరుకు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని రైల్వే పోలీసులు కోరుతున్నారు. కేసు నమోదు చేసుకున్న రైల్వే పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

భారత్‌కు బంగారు, కాంస్య పతకాలు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): కజకిస్తాన్‌లోని షిమ్‌కెంట్‌లో జరుగుతున్న 6వ ఏషియన్ షూటింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో స్టాండర్డ్ పిస్టల్ జూనియర్ మెన్ విభాగంలో భారత్ బంగారు, కాంస్య పతకాలను దక్కించుకుంది. ఈ నెల 30 వరకు జరిగే ఈ పోటీల్లో భారత్ తరఫున పాల్గొన్న హైదరాబాద్ వాసి కొడవలి తనిష్క్ మురళీధర్ నాయుడు 25 మీటర్ల రేంజ్‌లో బంగారు, కాంస్యం పతకాలు గెలుపొందాడు.



గణనాథునికి పూజలు చేస్తున్న కంటోన్మెంట్ శాసనసభ్యుడు శ్రీగణేశ్



గణేషునికి పూజలు చేస్తున్న బోయినపల్లి మార్కెట్ చైర్మన్ రాగీరు ఆనంద్‌బాబు, వైస్ చైర్మన్ డి.బి.దేవేందర్ తదితరులు



ఎకో బాలగణపతి విగ్రహం

వైభవంగా ఏకదంతుని వేడుకలు

సికింద్రాబాద్ ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఏకదంతుని నామస్మరణతో లష్కర్ వీధులు మారుమోగాయి. పార్వతీ పుత్రునికి జేజేలు పలుకుతూ ఆబాల గోపాలం భక్తిసంద్రంలో ఓలలాడారు. గణపతి బొప్పా మోరియా నినాదాలతో ప్రధాన కూడళ్లు, అంతర్గత వీధులు పరవశించిపోయాయి. లష్కర్‌లో వినాయక చవితి వేడుకలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. భిన్న భిన్న పరిమాణాల్లో, విభిన్న ఆకృతులతో మండపాల్లో కొలువుదీరిన గణనాథుడ్ని దర్శించుకుని భక్తులు తన్మయం చెందారు. ప్రజా ప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నేతలు, అధికార అనధికార ప్రముఖులు వినాయకునికి పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు. తమ కుటుంబ సభ్యులకు శుభం చేకూర్చాలని, తలపెట్టిన పనులు నిర్విఘ్నంగా కొనసాగేలా చూడాలని, లక్ష్యాన్ని విజయవంతం చేయాలని ప్రార్థించారు.

తిరుమలగిరిలో

వినాయక పర్వదినాన్ని భక్తులు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. తిరుమలగిరి బొల్లారంలలో ఉత్సవాలలో భాగంగా వీధి వీధిలో మండపాలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేశారు. మండపాల వద్ద పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. బొల్లారంలో బోయిన్‌పల్లి మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి, కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జయప్రకాష్, టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి నరసింహన్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరవిందలు వివిధ మండపాల్లో పూజలు నిర్వహించారు.

రెజిమెంటల్‌బజార్‌లో

న్యూ ఫ్రెండ్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో మోండా డివిజన్ రెజిమెంటల్‌బజార్ పోచమ్మ టెంపుల్ వద్ద ఏర్పాటు చేసిన బాలగణనాథుడు భక్తులను ఆకట్టుకుంటుంది. పది సంవత్సరాలుగా మట్టి విగ్రహాలను ఏర్పాటు చేసి పర్యావరణ పరిరక్షణతో పాటు భక్తిభావం పెంపొందించడానికి కృషి చేస్తున్నట్లు నిర్వాహకులు సుజన్ ముదిరాజ్ తెలిపారు.



తార్నాకలోని గోకుల్‌నగర్‌లో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో గురువారం జీహెచ్ఎంసీ మాజీ మేయర్ బండ కార్తీకారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

- తార్నాక, ఆంధ్రజ్యోతి



తార్నాకలోని లేబర్ అడ్డా ఆటోస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన వినాయక మండపంలో గురువారం బీజేపీ జిల్లా కార్యదర్శి మల్లికంటి వీరన్న పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్మిక నాయకులు ఆటో మల్లయ్య, పెయింటర్ రాజు, వెంకన్న, నరేష్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

- తార్నాక, ఆంధ్రజ్యోతి



చిలకలగూడ మున్సిపల్ మైదానంలో ఆకీషా ఫౌండేషన్ అధ్యక్షుడు, బీజేపీ సీనియర్ నాయకుడు బండపల్లి సతీష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ గణనాథుడి ప్రత్యేక పూజల్లో పాల్గొన్న అడిషనల్ డీసీపీ నర్సయ్య, ఏసీపీ శశాంక్‌రెడ్డి, చిలకలగూడ సీఐ అనుదీప్, సెక్టార్ ఎస్ఐ రవి తదితరులు.

- చిలకలగూడ, ఆంధ్రజ్యోతి



గణపతి నవరాత్రోత్సవాల్లో భాగంగా సికింద్రాబాద్ గణేష్ టెంపుల్‌లో గణపతికి గురువారం గంధాలంకారం, శేషవాహన సేవ నిర్వహించారు.

- రెజిమెంటల్ బజార్, ఆంధ్రజ్యోతి

మద్యం మత్తులో దాడి.. ముగ్గురిపై కేసు

బోయినపల్లి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : ముగ్గురు వ్యక్తులు కారులో వెళ్తున్న మరో ముగ్గురిపై దాడికి పాల్పడిన ఘటన బోయినపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని హస్మత్‌పేట అంబేద్కర్ చౌరస్తా వద్ద జరిగింది. బోయినపల్లి ఇన్‌స్పెక్టర్ తిరుపతి రాజు, ఎస్సై శివశంకర్‌లు తెలిపిన వివరాల ప్రకారం బుధవారం రాత్రి 11:30 గంటలకు తలసాని సైలాబ్ యాదవ్ కుమారుడు యూవంత్ యాదవ్, బంధువు వంశీ, టి.మనీష్‌లతో కలిసి హస్మత్‌పేట నుంచి గణేష్ మండపాలను చూడటానికి సికింద్రాబాద్‌కు కారులో వెళుతున్నారు. వారు హస్మత్‌పేట్‌లోని అంబేద్కర్ విగ్రహం సమీపంలోకి చేరుకున్నప్పుడు కొంతమంది గుర్తుతెలియని వ్యక్తులు మద్యం తాగి రోడ్డుపై గొడవ పడుతున్నారు. వారు రోడ్డు మధ్యలో బైక్ పార్క్ చేసి మార్గాన్ని అడ్డుకున్నారు. అటుగా వెళుతున్న యూవంత్ యాదవ్ అడ్డు తొలగమని హారన్ మోగించారు. అయినా వారు కదలక పోవడంతో యూవంత్, వంశీ, మనీష్‌లు అక్కడికి వెళ్లి వారిని రోడ్డుపై నుంచి వెళ్లిపోవాలని కోరారు. దీంతో మద్యం మత్తులో ఉన్న నిందితులు అసభ్యకరంగా దుర్భాషలాడుతూ వారిపై దాడి చేశారు.

ఈ క్రమంలో ఒక బాధితుని లాకెట్, ఉంగరం, బంగారు గొలుసు కనిపించకుండా పోయాయి. అలాగే వంశీ ఫోన్ కూడా దెబ్బతింది. అంతేకాకుండా నిందితులు బాధితులను తీవ్ర పరిణామాలు ఎదుర్కొంటారని బెదిరించారు. తర్వాత వారిపై దాడి చేసిన వ్యక్తులు ఫయాజ్, రియాజ్, బబ్లు కొందరు అని వారికి తెలిసింది. దుర్భాషలాడటమే కాకుండా తమపై దాడి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాధితులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యార్థినితో అసభ్య ప్రవర్తన

● హాస్టల్ సూపరింటెండెంట్‌ను సస్పెండ్ చేయాలని విద్యార్థి సంఘాల ధర్నా



ప్రిన్సిపాల్ చాంబర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్ఎఫ్ఐ విద్యార్థులు

అడ్డగుట్ట, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థిని పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఓ హాస్టల్ సూపరింటెండెంట్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం గ్రేటర్ కార్యదర్శి అశోక్‌రెడ్డి గురువారం కాలేజీ ప్రిన్సిపాల్ చాంబర్‌లో బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. మారేడుపల్లి పాలిటెక్నిక్ కళాశాలలో చదువుకుంటున్న ఓ విద్యార్థిని 26వ తేదీన హాస్టల్ బాల్కనీలో ఫోన్‌లో మాట్లాడుతున్న సమయంలో హాస్టల్ సూపరింటెండెంట్ సుధాకర్ విద్యార్థినిపై అసభ్యకరంగా ప్రవర్తించి, ముద్దు పెట్టడంతో విద్యార్థిని భయపడి తల్లిదండ్రులతో రోజు తెలిపింది. వెంటనే విద్యార్థిని తల్లిదండ్రులు కాలేజీ ప్రిన్సిపల్‌కు ఫిర్యాదు చేశారు. మూడు రోజులు గడుస్తున్నా సుధాకర్‌పై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం గ్రేటర్ కార్యదర్శి అశోక్‌రెడ్డితో పాటు విద్యార్థుల సంఘం ప్రతినిధులు ప్రిన్సిపాల్‌ను నిలదీశారు. ఈ క్రమంలో ప్రిన్సిపాల్ చాంబర్‌లోనే బైఠాయించి, నిరసన వ్యక్తం చేసి విద్యార్థినికి న్యాయం చేయాలని నినాదాలు చేశారు. సమాచారం అందుకున్న తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్‌రెడ్డితో పాటు ఎస్సైలు, సిబ్బంది కాలేజీకి చేరుకున్నారు. దాంతో వివాదం సద్దుమణిగింది. జరిగిన అన్యాయంపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సీఐ కోరగా విద్యార్థులు పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు.

బీసీల యుద్ధభేరి మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

బర్కత్‌పుర, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : బీసీలకు విద్యా, ఉద్యోగ, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ల సాధన కోసం ఈ నెల 31న రవీంద్రభారతిలో నిర్వహించే బీసీల యుద్ధభేరి మహాసభ వాల్ పోస్టర్‌ను టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్, ప్రొఫెసర్ కోదండరాం, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ గురువారం వేర్వేరుగా ఆవిష్కరించినట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జకృష్ణ తెలిపారు. ఈ మేరకు వారిని ఈ మహాసభకు ఆహ్వానించినట్లు తెలిపారు.

ఎస్‌సీఆర్‌లో మెడికల్ సర్టిఫికెట్ జారీ స్కాం

● సికింద్రాబాద్ డాక్టర్‌కు రూ.లక్ష లంచం ఎర ● ముగ్గురిపై సీబీఐ కేసు నమోదు

హైదరాబాద్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే (ఎస్‌సీఆర్) పరిధిలో మెడికల్ సర్టిఫికెట్ల స్కామ్ వెలుగు చూసింది. ఈ విషయమై ముగ్గురు వ్యక్తులపై కేంద్ర దర్యాప్తు సంస్థ(సీబీఐ) కేసు నమోదు చేసింది. విజయవాడ సీనియర్ ప్యాసింజర్ మేనేజర్ ఒంటిపూడి శివనాగప్రసాద్‌కు జారీ చేయాల్సిన మెడికల్ సర్టిఫికెట్‌ను సికింద్రాబాద్ - లాలాగూడ సెంట్రల్ హాస్పిటల్‌లో పనిచేస్తున్న డివిజనల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాస సత్యనారాయణ పెండింగ్‌లో పెట్టారు. ఈ సంగతి తెలుసుకున్న విజయవాడ రైల్వే ఆస్పత్రి ఆఫీసు సూపరింటెండెంట్ హస్మత్ అలీ బావమరిది షేక్ రసూల్ రంగంలో దిగాడు. నాగప్రసాద్‌కు మెడికల్ సర్టిఫికెట్ క్లియర్ చేయిస్తే రూ.లక్ష వస్తాయని రసూల్ తన బావకు చెప్పడంతో, తాను డాక్టర్ శ్రీనివాస సత్యనారాయణతో మాట్లాడుతానని, ఆ డబ్బు తేవాలని అతను సూచించాడు. దాంతో నాగప్రసాద్ నుంచి రసూల్ ఆ మొత్తాన్ని సేకరించాడు. ఈ విషయం తెలిసిన డాక్టర్ శ్రీనివాస సత్యనారాయణ సమాచారాన్ని సీబీఐకి చేరవేశాడు. ఈ నెల 26న హస్మత్‌అలీ, రసూల్, నాగప్రసాద్‌లపై కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించామని సీబీఐ అధికారులు తెలిపారు.



కృత్రిమ కొలనులో గణపతులను నిమజ్జనం చేస్తున్న భక్తులు

నిమజ్జనానికి జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో కొలను

● హర్షం వ్యక్తం చేస్తున్న భక్తులు

మారేడుపల్లి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : వెస్ట్ మారేడుపల్లి షెనాయ్ క్రీడా మైదానంలో నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని జీహెచ్ఎంసీ బేగంపేట డివిజన్ సర్కిల్ నంబరు-39 ఆధ్వర్యంలో వినాయ నిమజ్జనానికి భారీ కొలనును ఏర్పాటు చేశారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా నగర ప్రజల కోసం జీహెచ్ఎంసీ అధికారులు, ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకొని బస్తీ, కాలనీల్లో గణపతిని నిమజ్జనం చేసేందుకు కొలనులను అందుబాటులోకి తీసుకువచ్చారు. దీంతో సికింద్రాబాద్, కంటోన్మెంట్, మారేడుపల్లి, తుకారంగేట్, అడ్డగుట్ట, సంజీవయ్య నగర్, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు స్వయంగా వెళ్లి విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు వీలు కల్పించారు. మొదటి రోజున 18 మట్టి విగ్రహాలను నిమజ్జనం చేశారు. రాత్రి వేళలో మైదానానికి వచ్చే వారికోసం భారీ లైటింగ్‌ను ఏర్పాటు చేశారు. అదేవిధంగా జీహెచ్ఎంసీ, పోలీసు సంయుక్త ఆధ్వర్యంలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నారు. దూర ప్రాంతాలకు వెళ్లకుండా కాలనీ, బస్తీల్లో నడిబొడ్డున ఉన్న షెనాయ్ క్రీడా మైదానం గణేష్ నిమజ్జనానికి వేదికగా మారింది.

అరెస్ట్ వారెంట్ పేరిట వృద్ధుడికి బెదిరింపు

రూ.33.40 లక్షలు వసూలు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మీకు మానవ అక్రమరవాణా గ్యాంగుతో సంబంధాలున్నాయని, అరెస్ట్ వారెంట్ వచ్చిందని ఓ వృద్ధుడిని భయపెట్టిన సైబర్ నేరగాళ్లు అతడి నుంచి రూ.33.40 లక్షలు వసూలు చేశారు. వివరాలిలా ఉన్నాయి. బోయినపల్లికి చెందిన వృద్ధుడి(73)కి జూలై 25న ఓ సైబర్ నేరగాడు ఫోన్ చేసి తనను తాను కర్నాటక క్రైం బ్రాంచ్ అధికారి గౌరవ్ సారథిగా పరిచయం చేసుకున్నాడు. మానవ అక్రమరవాణా కేసులో మీ ఆధార్ కార్డు ఆధారంగా బ్యాంకు ఖాతాల వినియోగం జరిగిందని, మీపై అరెస్ట్ వారెంట్ జారీ అయిందని భయపెట్టాడు. అందుకు సంబంధించి నకిలీ పత్రాలు చూపి, విచారణ పూర్తయ్యే వరకు ఎవరితో మాట్లాడవద్దని ఆదేశించాడు. తర్వాత వీడియోకాల్‌లో మాట్లాడిన సైబర్ నేరగాడు దయానాయక్‌గా పరిచయం చేసుకుని ఫండ్ వెరిఫికేషన్ అంటూ రూ.15 లక్షలు ఆర్‌బీఐ ఖాతాలకు బదిలీ చేయాలని సూచించాడు. తర్వాత పలు కారణాలు చూపుతూ పలుమార్లు డబ్బు బదిలీ చేయించుకున్నాడు. వెరిఫికేషన్ పూర్తయిన తర్వాత డబ్బు మీ ఖాతాలో జమ చేస్తామని చెబుతూ ఆగస్టు 8 వరకు పలు దఫాలుగా రూ.33.40 లక్షలు వసూలు చేశాడు. డబ్బు ఎప్పుడు రీఫండ్ చేస్తారని ప్రశ్నించగా, అతను స్పందించడం మానేశారు. దాంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు సైబర్ క్రైం ఠాణాలో ఫిర్యాదు చేశాడు.

పెట్రోల్ బంక్‌లో అగ్ని ప్రమాదం

● రెండు ద్విచక్ర వాహనాలు దగ్ధం.. ఒకరికి స్వల్ప గాయాలు

● బంక్‌లో ఉన్న పెట్రోల్ ట్యాంకర్.. తృటిలో తప్పిన ప్రమాదం



పెట్రోల్ బంక్‌లో మంటలు చెలరేగుతున్న బైక్‌ను బయటకు లాగుతున్న స్థానికులు



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఇన్‌స్పెక్టర్ తిరుపతి రాజు

బోయినపల్లి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : ఓ యువకుడు బైక్‌లో ఫుల్ ట్యాంక్ పెట్రోల్‌ను పోయిస్తుండగా ఒక్కసారిగా మంటలు చెలరేగి పెట్రోల్ పోసే యంత్రంతో పాటు, రెండు ద్విచక్ర వాహనాలకు మంటలు అంటుకుని కాలిపోగా, యువకుడికి స్వల్ప గాయాలైన సంఘటన బోయినపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. బోయినపల్లి ఇన్‌స్పెక్టర్ తిరుపతి రాజు తెలిపిన వివరాల ప్రకారం బాలానగర్ ఫిరోజ్‌గూడకు చెందిన లోకేష్(26) బుధవారం సికింద్రాబాద్‌కు వెళ్లి తిరిగి వస్తూ బాలానగర్ వైపునకు వెళ్లే రహదారిలోని కేంద్రీయ విద్యాలయం పక్కన ఉన్న భారత్ పెట్రోల్ బంక్‌లో పెట్రోల్ పోయించుకోవడానికి బంక్‌కు చేరుకున్నాడు. బైకులో ఫుల్‌ట్యాంక్ చేయమని చెప్పాడు. దీంతో బంకు సిబ్బంది బైక్‌లో పెట్రోల్ పోస్తుండగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. భయభ్రాంతులకు గురైన లోకేష్ బైక్‌ను అక్కడే వదిలేసి పరుగులు తీయగా, బంకులో పని చేస్తున్న సిబ్బంది, వినియోగదారులు కూడా బయటకు పరుగులు తీశారు. ఈ క్రమంలో మంటలు పక్కనే ఉన్న మరో ద్విచక్ర వాహనంతో పాటు, పెట్రోల్ పోసే మిషన్‌కు అంటుకున్నాయి. దీంతో మంటలు ఎగిసి పడి బంక్ పైకప్పు వరకు వ్యాప్తి చెందాయి. మంటలను అదుపు చేయడానికి బంక్‌లో ఉన్న అగ్ని ప్రమాదాల నివారణ పరికరాలతో పాటు, బంక్‌లోని నీళ్ల పైప్ సహాయంతో మంటలను అదుపు చేసే ప్రయత్నాలు చేశారు. ఇంతలో అక్కడకు చేరుకున్న ఫైరింజన్ సహాయంతో మంటలను పూర్తిగా అదుపు చేశారు. ఈ ఘటనలో లోకేష్ బైక్‌తో పాటు, మరో స్కూటీ పూర్తిగా కాలిపోగా స్వల్ప గాయాలతో లోకేష్ ప్రాణాలతో బయటపడ్డాడు. కాగా బంక్‌లో మంటలు చెలరేగిన సమయంలో అదే బంక్‌లో పెట్రోల్ లోడు తీసుకువచ్చిన పెట్రోల్ ట్యాంకర్ అక్కడే ఉంది. దీంతో చెలరేగిన మంటలు బంక్‌తో పాటు, ట్యాంకర్‌కు ఎక్కడ అంటుకుంటాయోనని స్థానికులు, అటు వైపున వెళ్లే వాహనదారులు భయాందోళనలకు గురయ్యారు. మంటలు అదుపులోకి రావడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం కేసు నమోదు చేసుకున్న బోయినపల్లి పోలీసులు, అగ్నిమాపక అధికారులు విచారణ మొదలు పెట్టారు. అయితే పెట్రోల్ పోస్తుండగా పెట్రోల్ పోసే గన్‌కు ఉండే స్ప్రింగ్‌కు బైక్ ట్యాంక్‌కు మధ్య రాపిడి ఏర్పడి స్పార్క్‌లు వచ్చి మంటలు చెలరేగి ఉండవచ్చని అగ్నిమాపక అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.